క్లుప్తంగా

విరాళం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయానికి బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి–రమేశ్ దంపతులు మంగళవారం రూ.16వేల విరాళం అందించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న శ్రీరామనవమి రోజున నిర్వహించే కల్యాణ మహోత్సవానికి హాజరవాలని జెడ్పీటీసీ దంపతులను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. నాయిని సంతోశ్, చంద్రహస్, గంగాధర్, చందు తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

భైంసాటౌన్: ఏబీవీపీ ఎస్ఎఫ్డీ(స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో పర్యావరణ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్డీ గంగాప్రసాద్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం భైంసాలో ఆవిష్కరించారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో పర్యావరణ సంరక్షణే లక్ష్యంగా పలు అంశాలపై చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నగర ఎస్ఎఫ్డీ కన్వీనర్ విజయ్, ఉపాధ్యక్షుడు చందు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

దస్తురాబాద్: మండలంలోని మున్యాల హనుమాన్ ఆలయానికి గ్రామానికే చెందిన కంచె పవన్ ఆయన తండ్రి రాజన్న స్మారకార్థం మంగళవారం రూ.20వేల విలువైన వంట సామగ్రి అందించారు. కార్యక్రమంలో అర్చకులు వంశీధరాచార్యులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోండి

భైంసాటౌన్: విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని భైంసా జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ అన్నారు. మంగళవారం కళాశాలలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ తెలంగాణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్నివీర్ వాయుపై అవగాహన కల్పించారు. వైమానిక దళంలో సైనికులుగా చేరేందుకు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

వెయింగ్ మిషన్లు అందజేత



మిషన్లు అందిస్తున్న తహసీల్దార్ కవితారెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని 15 అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన వెయింగ్(బరువు కలిచే) మిషన్లను తహసీల్దార్ కవితారెడ్డి, సర్పంచ్ ముత్యంరెడ్డి అందజేశారు. సర్పంచ్ ముత్యంరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవ తి, వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు వార్డు సభ

భైంసాటౌన్: పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం వార్డు సభ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వార్డుసభలో లబ్ధిదారుల జాబితా ప్రచురిస్తామని, దరఖాస్తుదారులు హాజరై అభ్యంతరాలుంటే చెప్పాలని కోరారు. కొత్తగా దరఖాస్తులు స్వీకరించేది లేదని స్పష్టం చేశారు.

భైంసా చిన్నారులకు వండర్‌బుక్ రికార్డ్స్‌లో చోటు



సర్టిఫికెట్లు పొందిన చిన్నారులతో రంగు సౌమ్య

భైంసాటౌన్: ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో భైంసా చిన్నారులకు చోటు దక్కింది. మంచిర్యాలలో శ్రీ షిరిడి సాయిబాబా నాటకమండలి ఆధ్వర్యంలో ఈనెల 26న సంగీత నృత్య సమ్మేళనం నిర్వహించారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని 500 మందితో నిర్వహించిన కూచిపూడి శాస్త్రీయ నృత్య సమ్మేళనం ప్రదర్శనలో భైంసా నుంచి శ్రీ నయనం నృత్య కళానిలయానికి చెందిన 20 మంది చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారులకు సర్టిఫికెట్లు అందించినట్లు శ్రీ నయనం కళానిలయం నిర్వాహకులు రంగు సౌమ్య పేర్కొన్నారు.

రాణిస్తున్న మినాలిక..



పిట్ట కొంచెం.. ఆటలో మాత్రం ఘనం అని నిరూపిస్తోంది భైంసాకు చెందిన శ్రీ పాద మినాలిక. భైంసాలోని శ్రీ గౌతమి పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఈ చిన్నారి భైంసాలోని శ్రీనయనం కళానిలయంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంటూ ప్రదర్శనలు ఇచ్చింది. ఇటీవల మంచిర్యాలలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నృత్య ప్రదర్శనతోపాటు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం షిరిడీ సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రదర్శనలు చేసి శభాష్ అనిపించుకుంది. చిన్నారిని తల్లిదండ్రులు అంజనశ్రీ, శ్రీనివాస్ ప్రోత్సహిస్తున్నారు.





ముగిసిన ఇంటర్ పరీక్షలు



ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మంగళవారం ముగియడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద సందడిగా కన్పించారు. కలిసి చదువుకున్న దోస్తులను ఆలింగనం చేసుకుంటూ విజయ సంకేతం చూపుతున్న దృశ్యాలివీ.
- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఐక్యతతో అభివృద్ధి చేసుకోవాలి

● ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



రోడ్డు ప్రారంభోత్సవం వద్ద ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: గ్రామస్తులు ఐక్యంగా ఉండి అభివృద్ధి చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంజని గ్రామంలో రూ.35 లక్షలతో మార్కండేయ మందిరం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం రూ.రెండు కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటివరకు రంజని గ్రామానికి రూ.2.65 కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. త్వరలో వడ్డెర కాలనీలో నీటి సమస్య పరిష్కరించి వారి కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజేందర్, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, శంకర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షులు మోహినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్, సర్పంచ్ రంగారావ్, ఎంపీటీసీ హన్మాండ్లు, అనిల్, భూషణ్ తదితరులు ఉన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్ గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.2.50లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం సదరు ప్రొసీడింగ్‌ను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. భైంసా మండలం దేగాంలోని తన నివాసంలో సంఘం సభ్యులకు అందజేశారు. రాజు, గంగాధర్, గజ్జన్న, భోజన్న ఉన్నారు.

దిలావర్‌పూర్‌లో కార్డన్‌సెర్చ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై

ఖానాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల కట్టడికే పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సీఐ నారాయణనాయక్, ఎస్సై ఆర్.శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 70 ద్విచక్రవాహనాలతోపాటు 10 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడారు. వాహనదారులు అన్ని పత్రాలు కల్గి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

‘ప్రజావేదికలతో అధికారులకే లాభం’

ఖానాపూర్: ఉపాధిహామీ పథకంలో పక్కదారి పట్టిన నిధుల వివరాలను తేల్చేందుకు చేపట్టిన ప్రజావేదికలతో అధికారులకే లాభం తప్ప కూలీలకు ఉపయోగం లేదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై నిర్వహించిన ప్రజావేదికలో లక్షల రూపాయల అవినీతి వెలుగు చూసినప్పటికీ ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడమే నిదర్శనమన్నారు. ప్రజావేదికల్లో అక్రమంగా వసూలు చేసిన డబ్బుల ద్వారా ఉన్నతాధికారులు కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. వారిపై ఏసీబీ దాడులు చేయిస్తే అక్రమ ఆస్తులు వెలుగులోకి వస్తాయన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేశ్, మడిగెల గంగాధర్, తోట సత్యం తదితరులు ఉన్నారు.

బీజేపీ ఐటీ సెల్ సంయుక్త కన్వీనర్‌గా శ్రీధర్

నర్సాపూర్(జి): బీజేపీ జిల్లా సోషల్ మీడియా ఐటీ సెల్ సంయుక్త కన్వీనర్, నిర్మల్, ఖానాపూర్, ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా నర్సాపూర్(జి) మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రావుల శ్రీధర్‌ను నియమించినట్లు పార్లమెంట్ ఐటీ కన్వీనర్ నరేష్ చౌబే ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ వైఫల్యాలను సోషల్ మీడియా ద్వారా ఎండగడతామన్నారు.

భూమిపూజ

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో మంగళవారం మహాపోచమ్మ ఆలయం వద్ద రూ.20 లక్షలతో షెడ్డు నిర్మాణ పనులకు డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి భూమిపూజ చేశారు. బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ధర్మన్న, సుమన్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

‘బీజేపీని బలోపేతం చేయాలి’

నిర్మల్‌చైన్‌గేట్: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నిర్మల్ అసెంబ్లీ పాలక్ కాట్‌పల్లి వెంకట్‌రమణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నిర్మల్ అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, ప్రధాన కార్యదర్శులు మెడిసమ్మె రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ మురళీధర్, అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

మామడ: మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ఐకే రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమం అడ్డుకుంటారని ముందస్తుగా స్థానిక బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వదిలిపెట్టారు. అరెస్టయిన వారిలో కొరిపెల్లి లింగారెడ్డి, అశోక్, రంజిత్, శ్రీనివాస్, లింగన్న, రాములు ఉన్నారు.

ఉత్సాహంగా అల్ఫోర్స్ కళోత్సవం



ప్రదర్శనలో విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాల కళోత్సవం నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత రవీందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించగా ముఖ్య అతిథిగా డీఈవో రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ విద్యనభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. జిల్లాలో అల్ఫోర్స్ ముందంజలో నిలిచేలా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. డీఈవో మాట్లాడుతూ తమకు ఆసక్తి ఉన్న కలల్లో విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం వేడుకలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షవర్ధిని, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పనులను ఇంటింటికీ వివరించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, సర్పంచ్‌లు బాలవ్వ, గంగన్న, నాయకులు లచ్చన్న, స్టీఫెన్, ఇందూర్‌నేత, గంగన్న, తదితరులు ఉన్నారు.

‘మంత్రిపై అసత్య ప్రచారం మానుకోవాలి’

నిర్మల్‌టౌన్: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్ నిర్మల్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రిపై నిరాదరణ ఆరోపణలు చేసిన మహేశ్వర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేస్తే.. కాంగ్రెస్ నాయకులు మంత్రి దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ ఉద్యోగాలు అమ్ముకున్నట్లు ఆధారాలు చూపితే రాజకీయ సన్యాసం తీసుకుంటామన్నారు. రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దు చేసినా బీజేపీకి వ్యతిరేకంగా మహేశ్వర్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగడే మోనని సందేహాలు ఏర్పడుతున్నాయన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్ సీఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, పలువురు కౌన్సిలర్లు నేరెళ్ల వేణు, బిట్లింగ్ నవీన్, సలీం, మేడారం అపర్ణ ప్రదీప్, నరహరి, రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎంపై అధికారులకు శిక్షణ



తానూరు: ప్రకృతివనం వద్ద అధికారులు

తానూరు: గ్రామాల్లో ప్రజలు పరిసరాల శుభ్రత పాటించేలా చూడాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ఉమ్రి(కే) పల్లె ప్రకృతివనంలో స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం)పై ఆయా శాఖల అధికారులకు రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురికి కాలువలను శుభ్రపరచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. గడువులోగా వంద శాతం ఇంటిపన్నులను వసులు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. మియావాకి పద్ధతిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. వారి వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్, ఎంపీవో మోహన్ సింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పృథ్వీ, ఉమ్రి(కే) సర్పంచ్ తర్నమాల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారద, అనిత, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

ముధోల్: స్వచ్ఛభారత్ గ్రామీణ మిషన్ ఫేస్‌టు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయి సందర్శన చేశారు. గ్రామంలోని మల్లన్న ఆలయం ప్రాంగణంలో విలేజ్ సోషల్ మ్యాప్ గీసి సమస్యలను తెలుసుకునేందుకు అన్ని శాఖల సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తిరుగుతూ మరుగుదొడ్ల వినియోగం , పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ లావణ్య, సర్పంచ్ స్వర్ణలత, ముధోల్, బాసర ఎంపీడీవోలు సురేశ్‌బాబు, నాగనాథ్, ఏపీవోలు సదానంద చారి, శిరీష, తదితరులు ఉన్నారు.

వసతులు కల్పించాలని వినతి

ఖానాపూర్: రంజాన్ మాసం పురస్కరించుకుని పట్టణంలోని మైనార్టీ కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, కౌన్సిలర్లు అఫ్రినాబేగం, ఫౌజియాబేగం కోరారు. మంగళవారం ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, కమిషనర్ రత్నాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ముస్లింలు నివసించే కాలనీల్లో, మసీదుల పరిసరాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కోఆప్షన్ సభ్యులు అంజద్‌ఖాన్, సుల్తానా, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, మొయినొద్దీన్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని గ్రామాల్లో కనీస వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్‌రూరల్‌శాఖ ఆధ్వర్యంలో రూరల్ తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి షేక్ ఇంతియాజ్, మండలాధ్యక్షుడు సయ్యద్ బషీర్ అలీ, సయ్యద్‌సిరాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ మాజీద్, రత్నాపూర్ కాలనీ మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ నిజాం, సభ్యులు ఉన్నారు.

‘సిరిచెల్మ–పల్గంపాండ్రి రోడ్డు బాధ్యత బీజేపీదే’



మాట్లాడుతున్న తొడసం శంభు

పెంబి: సిరిచెల్మ–పుల్గంపాండ్రి రోడ్డుకు కేంద్రం నిధులు మంజూరు చేయించిన బీజేపీనే నిర్మాణ బాధ్యత తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. బీజేపీ ఎంపీ సోయం బాపురావు రెండు నెలల కిందట ఇచ్చోడ మండలం ఫకీర్‌పేట నుంచి పెంబి మండలం పుల్గంపాండ్రి వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేశారన్నారు. అయితే పనులను ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడంతో రోడ్డు నిర్మాణం విస్మరించారన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ నియమాలు రూపొందించిందని, దానిప్రకారం కమిటీ వేసి సిరిచెల్మ రోడ్డుకు అనుమతులు వచ్చేలా ఎంపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుల్గంపాండ్రి- సిరిచెల్మ రోడ్డు నిర్మాణం చేపడితే ఖానాపూర్, పెంబి మండలాల ప్రజలకు ఆదిలాబాద్ వెళ్లేందుకు దూరభారం తగ్గుతుందని.. సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట టీఏజీఎస్ నాయకులు జంగుబాపు, భీంరావు, పెద్రం జంగు, రవీందర్, జైవంత్‌రావు, జుగాదిరావు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని విద్యావిలీన కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్ 22 మంది దివ్యాంగులైన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఐఈఆర్‌టీ భూమన్న, రాము, విద్యార్థుల పోషకులు ఉన్నారు.

కంటివెలుగు శిబిరం

ఖానాపూర్: మండలంలోని సేవానాయక్ తండాలో మంగళవారం రెండోవిడత కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్‌రమేశ్‌నాయక్ ప్రారంభించారు. రాజేశ్, సౌజన్య, బాపురావు, లక్ష్మణ్, నరేందర్ ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

తానూరు: మండల కేంద్రంలో ఉపాధి పనులను మంగళవారం సర్పంచ్ విఠల్ ప్రారంభించారు. జాబ్ కార్డు లేకుంటే పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మాధవ్‌రావుపటేల్, టీఏ రమణాగౌడ్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్‌ఎం జానిరెడ్డి ప్రారంభించారు. బైతుల్‌మాల్ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించడం అభినందనీయమన్నారు. డీఎం అమృత, సఫా బైతుల్‌మాల్ సభ్యులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

లక్ష్మణచాంద(సోన్): సోన్ మండలం న్యూవెల్మల్‌లో బాబా ఆలయం వద్ద రూ.25లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ గంగామణి, ఎంపీటీసీ నాగయ్య ప్రారంభించారు. నర్సయ్య, శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

‘నాసిరకంగా రోడ్డు పనులు’

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్‌లో సీసీరోడ్ల నిర్మాణ పనులు నాసిరకంగా చేపడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం దస్తురాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుట్టాపూర్ పంచాయతీ పరిధిలో ఉపాధి నిధులు రూ.70 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. పంచాయతీరాజ్ ఏఈ లవకుమార్ పనులు పరిశీలించకుండానే బిల్లులను సిద్ధం చేశారని.. దీనిపై త్వరలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. బొమ్మెన సురేశ్, రాజేశ్వర్, తిరుపతి ఉన్నారు.

పోషణ్ పక్వాడ్‌పై అవగాహన

లక్ష్మణచాంద(సోన్): సోన్, లక్ష్మణచాంద మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యవతి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వీడ్కోలు వేడుకలు

కుంటాల: మండలంలోని ఓలా, లింబా(కే) ఉన్నత పాఠశాలల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ కనీష్ ఫాతిమా, హెచ్‌ఎంలు సతీశ్‌కుమార్, రాజేశ్వర్, ఎస్ఎంసీ చైర్మన్ రాందాస్ తదితరులు ఉన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలోని వింధ్యా ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. కరస్పాండెంట్ రమేశ్, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ ఉన్నారు.

మంత్రికి వినతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని రాంనగర్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తమ సంఘ భవనం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ అకోజీ కిషన్, అధ్యక్షుడు కొలిప్యాక భీమాచారి, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి టేకులపల్లి రాందాస్, సభ్యులు ఉన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కడెం: పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భుక్య రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు, అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించవద్దని కోరారు. ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు భానుతేజ, తదితరులు ఉన్నారు.

పరీక్షప్యాడ్ల పంపిణీ

మామడ: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పొన్కల్ ఉపసర్పంచ్ కాలగిరి నరేశ్ రెడ్డి, ఎన్ఆర్ న్యూస్ నిర్వాహకులు విజయ్‌కుమార్ రెడ్డి మంత్రి సమక్షంలో అందించారు. ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, రాంకిషన్‌రెడ్డి, గౌతంరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, లింగారెడ్డి, గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, నవీన్ రావ్, రాందాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చదివిన పాఠశాలకు చేయూత

కుంటాల: కుంటాలకు చెందిన భూమన్న యాదవ్ తానూర్ మండలం ఎల్వి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తాను చదివిన కుంటాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ తాగేందుకు 100 గ్లాసులు, పరీక్షా సామగ్రి పంపిణీ చేసి ఔదార్యం చాటుకున్నారు. భూమన్నను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు గజపల్లి నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంబి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకల రాంచందర్ పరీక్షప్యాడ్లు అందించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, హెచ్‌ఎం నర్సింహచారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుభీర్: మండలంలోని నిగ్వా, మాలేగాం పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల హిందీ పండిట్ రమేశ్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నిగ్వాలో 22 మందికి, మాలేగాంలో 12 మందికి అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సురేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ ఉన్నత పాఠశాలలో 30 మంది పదో తరగతి విద్యార్థులకు తిమ్మాపూర్ హిందీ ఉపాధ్యాయుడు కొత్తిమీర రమేశ్ పరీక్షా సామగ్రి అందజేశారు. విద్యార్థులకు రూ.మూడు వేల విలువైన పరీక్షప్యాడ్లు, పెన్నులు, చేతి గడియారాలను అందించారు. ప్రధానోపాధ్యాయుడు విద్యాధర్, ఉపాధ్యాయులు దశరథ్, శ్రీనివాస్, సత్యనారాయణ, శంకర్, అరుణ ఉన్నారు.

మన్మద్‌లో..

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన జెడ్ల నారాయణ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. లక్ష్మణ్, గురుకృప వొకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, తదితరులు ఉన్నారు.

పరామర్శ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నిర్మల్ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవరకోట కమిటీ సభ్యుడు నేళ్ల అనిల్ తండ్రి పోశెట్టిని మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. వారి వెంట చైర్మన్ ఈశ్వర్, రాము తదితరులు ఉన్నారు.